క్లుప్తంగా

చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం



చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఫాదర్ రంగయ్య

బేస్తవారిపేట: చేతుల పరిశుభ్రత పాటిస్తే వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని చర్చ్ ఫాదర్ గుర్రం జాన్ రంగయ్య అన్నారు. మంగళవారం స్థానిక టీచర్స్ కాలనీలో బిలీవర్స్ ఈస్టర్న్స్ చర్చ్‌లో గ్లోబల్ హ్యాండ్ వాష్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఆహారం తీసుకునే ముందు తప్పనిసరిగా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చర్చ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో ఆరోగ్యం



చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఈఓఆర్డీ

తర్లుపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్డీ సుకుమార్ ఆధ్వర్యంలో గ్లోబల్ హ్యాండ్ వాష్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందికి చేతల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఆస్పత్రులు, పాఠశాలలు లేదా రోజువారీ కార్యక్రమాల్లో పాల్గొనే వారు కచ్చితంగా సబ్బుతో చేతులు కడుక్కోవడం అలవాటు చేసుకోవాలని ఈఓఆర్డీ సూచించారు. పంచాయతీ సెక్రటరీలు, ఈసీ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

కూటమి కట్టేసి.. మద్యం షాపులు కొట్టేసి..!

- మార్కాపురం నియోజకవర్గంలో లిక్కర్ షాపులన్నీ కూటమి నేతలవే
- వ్యూహాత్మకంగా పావులు కదిపిన టీడీపీ–జనసేన నాయకులు
- తమ అనుచరులతో అధిక సంఖ్యలో టెండర్లు దాఖలు
- అధిక ధరలకు మద్యం విక్రయించేందుకు రంగం సిద్ధం
- పల్లెల్లో ఇప్పటికే బార్లా తెరుచుకున్న బెల్ట్ షాపులు



మార్కాపురంలో ఓ లిక్కర్ షాపు వద్ద మందుబాబుల హడావుడి

మార్కాపురం/మార్కాపురం టౌన్: మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు టీడీపీ కూటమి నేతలు వేసిన ఎత్తుగడ ఫలించింది. మార్కాపురం నియోజకవర్గంలో లిక్కర్ షాపులన్నీ టీడీపీ, జనసేన కూటమి నేతలు, వారి అనుచరులకే దక్కాయి. వ్యూహం ప్రకారం తమ మద్దతుదారులు, అనుకూలమైన వారితోనే టెండర్లు అధిక సంఖ్యలో దాఖలు చేయించడంతో లాటరీలో వారికే దక్కాయి. మార్కాపురం నియోజకవర్గంలో మొత్తం 19 మద్యం షాపులున్నాయి. వీటిలో 15 దుకాణాలు టీడీపీ జనసేన కూటమి నాయకుల మద్దతుదారులకే లభించాయి. మిగిలిన నాలుగు షాపులు ఇండిపెండెంట్ వ్యక్తులకు సొంతమయ్యాయి. ప్రభుత్వ పెద్దల ఆలోచనలను ఆచరణలో పెట్టిన కూటమి నాయకులు ఎక్కువ సంఖ్యలో దరఖాస్తు చేయించడంతో మొత్తం 19 షాపులకు సుమారు 330 దరఖాస్తులు వచ్చాయి. వీటికి సంబంధించి షాపుల కేటాయింపును సోమవారం ఒంగోలులో కలెక్టర్ సమక్షంలో లాటరీ ద్వారా కేటాయించారు. మార్కాపురం పట్టణంలో 4, మార్కాపురం రూరల్ మండలంలో 3, తర్లుపాడు 2, కొనకనమిట్ల 3, పొదిలి టౌన్ 5, పొదిలి రూరల్ పరిధిలో 2 మద్యం షాపులు ఉన్నాయి. వీటిలో మార్కాపురం టౌన్‌లో 3, మార్కాపురం రూరల్‌లో 2, తర్లుపాడులో 2, కొనకనమిట్లలో 3, పొదిలిలో మొత్తం 7 షాపులకుగాను ఐదింటిలో కూటమి నేతలు, వారి అనుచరులు పాగా వేశారు. అంతా తామనుకున్నట్టే జరగడంతో బుధవారం నుంచి నూతన దుకాణాలను ప్రారంభించేందుకు సన్నాహాలు ప్రారంభించారు.

దుకాణాలు దక్కింది వీరికే..

పొదిలి నగర పంచాయితీలో పేరం రామాంజనేయులు, ఆవులూరి కోటేశ్వరరావు, బోయల నాగేశ్వరరెడ్డి, టంగుటూరి వెంకటరావు, ఎం వేణు, పొదిలి రూరల్‌లో ఈర్ల వెంకటేశ్వర్లు, జె రమణయ్యలు షాపులను దక్కించుకున్నారు. కొనకనమిట్ల మండలంలో వరికూటి లక్ష్మీ తాయారు, ఎం.నరసింహారెడ్డి, ముటుకుల నాగేశ్వరరావు, తర్లుపాడు మండలంలో కూనపులి దత్తాత్రేయ మహేష్‌కుమార్, మక్కెళ్ల శ్యామ్‌కుమార్, మార్కాపురం మున్సిపాలిటీలో దగ్గుల శ్రీనివాసులరెడ్డి, పిన్నిబోయిన శ్రీనివాసరావు, ఎం సాయి మణికంఠ, మక్కెళ్ల శ్యామ్‌కుమార్, మార్కాపురం రూరల్‌లో బీ శ్రీశైలం, వజ్రాల శ్రీనివాసరెడ్డి, ఈర్ల వెంకటేశ్వర్లు లైసెన్స్ పొందారు.

గత ప్రభుత్వంలో ఇలా..

గత ప్రభుత్వంలో మద్యపాన నియంత్రణ కోసం అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రైవేటు లిక్కర్ షాపులను తొలగించి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. తాగుడు మాన్పించాలనే ఉద్దేశంతో ముందుగా చెప్పిన ప్రకారం అధిక ధరలకు అమ్మారు. దీంతో చాలా కుటుంబాలు మద్యం మహమ్మారికి దూరమయ్యాయి. ఎంతో మంది ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడ్డారు. పిల్లాపాపలతో సంతోషంగా గడిపారు. పరివర్తన కార్యక్రమం ద్వారా నాటుసారా తయారీదారుల కుటుంబాల్లో మార్పుతెచ్చి వారికి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపారు. బ్యాంకుల ద్వారా మహిళలకు ఆర్థిక చేయూత అందించి వివిధ షాపులను ఏర్పాటు చేయించారు. మార్పురాని నలుగురు సారా తయారీదారులపై పీడీ యాక్టు నమోదు చేసి జిల్లా నుంచి బహిష్కరించారు.

నియోజకవర్గం	మార్కాపురం
మొత్తం మద్యం దుకాణాలు	19
దరఖాస్తుదారుల సంఖ్య	330
టీడీపీ -జనసేన శ్రేణులు పొందినవి	15
ఇండిపెండెంట్ వ్యక్తులకు దక్కినవి	4

పల్లెల మెడకు మళ్లీ 'బెల్ట్'

కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ ప్రైవేట్ లిక్కర్ షాపులు ఏర్పాటయ్యాయి. గత 3 నెలల నుంచి గ్రామాల్లో కూటమి నేతల ఆధ్వర్యంలో బెల్టు షాపులు తెరిచారు. నూతన దుకాణాలకు అనుబంధంగా ఈ బెల్టుషాపులు కూడా కొనసాగించేందుకు కూటమి నేతలు సిద్ధమయ్యారు. బెల్టుషాపుల నిరోధానికి ఎక్సైజ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే. కాగా గత రెండు రోజుల నుంచి మార్కాపురం పట్టణంలోని దుకాణాల్లో అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నారు. బాటిల్‌పై 100 నుంచి 150 రూపాయల వరకు వసూలు చేస్తుండటంతో మందుబాబులు లబోదిబోమంటున్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి



కలాంకు నివాళులర్పిస్తున్న వెన్నా హనుమారెడ్డి



కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కిట్స్ కళాశాల సిబ్బంది

మార్కాపురం: భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జీవితం యువతకు ఆదర్శనీయమని వీహెచ్‌ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజశేఖర్‌రెడ్డి, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

■ డాక్టర్ సామ్యేల్ జార్జ్ ఇంజినీరింగ్ కళాశాలలో కలాం కాంస్య విగ్రహానికి ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ రాజబాబు నివాళులర్పించారు. భావిభారత ఇంజినీర్లు కలాంను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ మస్తానయ్య, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు. కళాశాల అడ్వైజర్, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, డైరెక్టర్ విశాల్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

■ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. సెక్రటరీ అన్నా కృష్ణచైతన్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రంగనాయకులు, ఏఓ ప్రభాకర్, హెచ్‌ఓడీలతో పాటు ఎన్‌ఎస్‌ఎస్ పీఓ అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

■ స్థానిక ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో అబ్దుల్ కలాం చిత్రపటానికి చైర్మన్, డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. డైరెక్టర్ మసూద్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చిరుద్యోగుల పొట్టకొట్టడం దారుణం



మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలో మాట్లాడుతున్న ఉమామహేశ్వర్

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు
- 25 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను ఎలా తొలగిస్తారని ప్రశ్న
- మార్కాపురంలో కాంట్రాక్టు కార్మికుల రిలే నిరాహార దీక్ష ప్రారంభం

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘంలో అక్రమంగా తొలగించిన కాంట్రాక్టు ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కాంట్రాక్టు కార్మికుల రిలే దీక్షను ఆయన ప్రారంభించి మాట్లాడారు.

గత 25 ఏళ్లుగా మార్కాపురం మున్సిపాలిటీల్లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులను తొలగిస్తూ వారి పొట్టకొట్టే విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. టీడీపీ కూటమి నేతలు తమది ఫ్రెండ్లీ ప్రభుత్వం, చిరుద్యోగులే మా మిత్రులని ప్రచారం చేస్తూ ఆచరణలో మాత్రం ఉద్యోగాల నుంచి ఊడబీకుతున్నారని మండిపడ్డారు. కార్మికుల తొలగింపులో నిబంధనలు తుంగలో తొక్కారని దుయ్యబట్టారు.

సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన

తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అధికారుల నుంచి ఎటువంటి ఉత్తర్వులు లేకుండా తమను విధుల నుంచి తొలగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రఫీ, సోమయ్య, కాంట్రాక్టు, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సుబ్బరాయుడు, హరి, కనకయ్య, హరీష్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారునికి రూ.15 వేలు ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న డాక్టర్ ప్రణీత్, నాయక్ తదితరులు

మార్కాపురం: జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన క్రీడాకారునికి మార్కాపురం పట్టణంలో పలువురు ఆర్థిక సాయం అందించారు. పేదింటి క్రీడాకారుడు సీహెచ్ ఆదినారాయణకు తమవంతు సాయంగా సిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సాయి ప్రణీత్, జిల్లా ఆరో అదనపు న్యాయస్థానం అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.బాలూనాయక్, సబ్ డీఎఫ్ఓ వేణు, కేతగుడిపి హెచ్‌ఎం జ్యోతి తదితరులు రూ.15 వేల ఆర్థికసాయాన్ని అందించారు. అథ్లెటిక్స్‌లో రాణించాలని ఆకాంక్షించారు.



గోతులమయమైన కంభం-తర్లుపాడు ఆర్‌అండ్‌బీ రోడ్డు



చిత్తడిగా ఉన్న విద్యానగర్ కాలనీలో రోడ్డు



అధ్వానంగా కంభం అర్బన్ కాలనీ ప్రధాన రహదారి

చినుకు పడితే చిత్తడే..!

కంభం: కంభం, కందులాపురం, హజరత్‌గూడెం పంచాయతీల్లో చిన్నపాటి వర్షం కురిసినా రహదారులు అధ్వాన్నంగా మారిపోతున్నాయి. దాదాపు కలిసి ఉండే ఈ మూడు పంచాయతీల్లో సీసీ రోడ్లు పూర్తి స్థాయిలో లేవు. డ్రైనేజీ సైతం లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా వర్షం నీరు, మురుగు రోడ్లపైనే నిల్వ చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కంభం పంచాయతీలోని అర్బన్ కాలనీ ప్రధాన రహదారిలో సీసీ రోడ్డు లేకపోవడంతో గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు మరింత అధ్వానంగా తయారైంది. కందులాపురం పంచాయతీ పరిధిలోని విద్యానగర్ కాలనీ, కంభం నుంచి తర్లుపాడుకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి, రావిపాడు రోడ్డు ఛిద్రమైపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్లు, డ్రైనేజీ నిర్మించాలని ఆయా పంచాయతీల ప్రజలు కోరుతున్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే



బోడపాడులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కందుల

రాచర్ల: ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజా సమస్యల వినతులు స్వీకరించడమే కాకుండా, వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. అనంతరం రాచర్ల ఫారం, పలుగుంటిపల్లె, రాచర్ల గ్రామంలో సిమెంటు రోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈదుల సుజాత, ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంఈఓ వారణాసి గిరిధర్ శర్మ, ఎస్సై పి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం రాయవరం, కోలభీమునిపాడు, పెద్దనాగులవరం, బోడపాడు గ్రామాల్లో సిమెంటు రోడ్లకు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మంగళవారం భూమిపూజ చేశారు. పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, తాగునీటికి ఇబ్బందిలేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ భాగ్యవతి, పీఆర్ ఏఈ మోహన్‌రాజ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



గొట్లగట్టులో లేత మినుము పైరులో నిలిచిన నీరు



పాతపాడులో లోతట్టు పొలంలో ఇలా..

లోతట్టు పొలాల్లో వర్షం నీరు

కొనకనమిట్ల: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి భూములు పదునెక్కడంతోపాటు లోతట్టు పొలాల్లో నీరు చేరింది. ఇటీవల రబీ సీజన్‌లో సాగు చేసిన మినుము, అలసంద పైర్లకు ఈ వర్షం ఉపయోగకరమే అయినప్పటికీ లోతట్టు పొలాల్లో నీరు నిల్వ చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మెట్ట పంటలకు ఈ వర్షం అనుకూలంగా ఉంటుందని, అధికంగా కురిస్తే మాత్రం పంటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా.. రెండు రోజులుగా కురిసిన వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో అంతర్గత రహదారులు చిత్తడిగా మారాయి.

ఎడతెరపిలేని వర్షం.. రోడ్లు బురదమయం



మార్కాపురం సబ్ జైలు వద్ద ఇలా..



అధ్వానంగా తయారైన జీజీహెచ్ ప్రాంగణం

మార్కాపురం: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మార్కాపురం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లు బురదమయమై రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ప్రధానంగా సబ్‌జైలు ప్రాంగణం, కొండేపల్లి రోడ్డు, జీజీహెచ్ ప్రాంగణం, చెరువుకట్ట రోడ్డు, డ్రైవర్స్ కాలనీలో రోడ్లపై తారు లేచిపోయి గుంతలు ఏర్పడ్డాయి. రోడ్లకు తాత్కాలికంగానైనా మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షపాతం ఇలా..

మంగళవారం ఉదయం 11 గంటల వరకు మార్కాపురం ప్రాంతంలో వర్షం కురిసింది. ఆ తరువాత నుంచి ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు మాత్రమే పడుతున్నాయి. ఉదయం 11 గంటల సమయానికి మార్కాపురంలో 4.2 మి.మీ, తర్లుపాడులో 2.2 మి.మీ, కొనకనమిట్లలో 7.6 మి.మీ, పొదిలిలో 8.2 మి.మీ వర్షపాతం నమోదైంది.



మున్సిపల్ డీఈగా శ్రీనివాసరావు

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపల్ డీఈగా ఎ.శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు డివిజన్ ఏపీ టిడ్కో డీఈగా విధులు నిర్వర్తిస్తున్న ఆయన బదిలీపై మార్కాపురంలో నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న సుబానీ మాచర్లకు బదిలీ అయ్యారు.

నాగులవరం వంతెన పరిశీలన

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం పెద్ద నాగులవరం వంతెనను ఇన్‌చార్జి ఎంపీడీఓ భాగ్యవతి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి రేవతి, వీఆర్‌ఓ కల్యాణి మంగళవారం పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వంతెనను పరిశీలించి ఎప్పటికప్పుడు ఇరిగేషన్, పోలీసు అధికారులకు సమాచారం అందిస్తున్నామన్నారు.



పెద్దనాగులవరం వద్ద వంతెనను పరిశీలిస్తున్న అధికారులు



మాట్లాడుతున్న ఏఓ మెర్సీ

బేస్తవారిపేట: పట్టు పురుగుల పెంపకం షెడ్లకు సబ్సిడీ అందిస్తున్నట్లు పట్టు పరిశ్రమశాఖ ఫీల్డ్ అసిస్టెంట్ డీవీ శివ తెలిపారు. మంగళవారం సోమవారిపేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఓసీ, బీసీ రైతులకు రూ.4.50 లక్షలకుగాను రూ.3.50 లక్షలు, ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.4.05 లక్షలు సబ్సిడీ ఇస్తున్నట్లు వివరించారు. ఉద్యానవనశాఖ విస్తరణాధికారి శేషగిరి, ఏఓ జక్కం మెర్సీ, వీఏఏలు ప్రతాప్‌రెడ్డి, ఆర్.సుజాత పాల్గొన్నారు.

శనగ విత్తనాలకు దరఖాస్తు చేసుకోండి

కొమరోలు: పప్పు శనగ విత్తనాలు అవసరమైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ కె.రాజశ్రీ సూచించారు. మంగళవారం ఎడమకల్లు, రాజుపాలెం రైతు సేవా కేంద్రాల్లో శనగ విత్తనాల రిజిస్ట్రేషన్‌ను తనిఖీ చేశారు. సబ్సిడీ పోను రైతులు క్వింటా జేజీ-11 రకం విత్తనాలకు రూ.7050, కేఏకే-2 రకానికి రూ.9,075 చెల్లించాలని సూచించారు. మండలానికి జేజీ రకం 1394 క్వింటాలు, కేఏకే రకం 1276 క్వింటాళ్లు కేటాయించినట్లు చెప్పారు.

రాయితీపై మల్బరీ షెడ్లు

పొలాల్లో నీటిని బయటకు పంపాలి

పొదిలి రూరల్: వర్షాల నేపథ్యంలో పొలాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ జైనులాబ్దీన్ సూచించారు. పొదిలి మండలంలోని సూదనగుంటలో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. ముందుగా ఖరీఫ్-2024 పంటల జాబితా వివరాలు తెలియజేశారు. వర్షాల వల్ల సజ్జ, కంది, మిరప పంటలకు ఏమైనా నష్టం జరిగితే తెలియజేయాలని సూచించారు. కోత కోసిన పంటలపై కప్పిన టార్పాలిన్ పట్టలు తీయకుంటే కంకులు రంగు మారే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పత్తి, కంది, వరి రైతులకు అవగాహన

మార్కాపురం రూరల్: మండలంలోని భూపతిపల్లి, బొందలపాడు గ్రామాల్లో పత్తి, కంది, వరి రైతులకు మంగళవారం మార్కాపురం ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు అవగాహన కల్పించారు. ప్రస్తుతం కంది కాయ ఏర్పడే దశలో ఉందని, పొలంలో నీరు నిల్వ ఉన్నట్లయితే బయటకు పంపి పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు, కార్బండిజం, మాంకోజెబ్ 2.5 గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పత్తి మొక్కలు భూమి నుంచి పోషకాలను గ్రహించే స్థితిలో ఉంటాయని, అధిక తేమ కారణంగా మొక్కలు ఎర్రబడటం, వాడిపోతాయని చెప్పారు. నివారణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి రవళి, భూపతిపల్లె, బొందలపాడు రైతు సేవా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కొనకనమిట్ల: పంటను ఆశించే తెగుళ్లు, పురుగుల నివారణకు సస్య రక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడి సాధించేలా కృషి చేయాలని దర్శి ఏడీఏ బాలాజీనాయక్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం కాట్రగుంట, గరిమినపెంట రైతు సేవా కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో రైతులకు సాగులో మెళకువలను వివరించారు. కంది, మినుము, అలసంద, వరి సాగు చేసిన పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు పడుతుండటంతో పంట పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపాలన్నారు. నీరు ఎక్కువగా ఉంటే 19-19-19 లేదా 13-0-45 మందును 2 లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ప్రసన్న రంగలక్ష్మి, వీఏఏ శిరీష, రైతులు పాల్గొన్నారు.